క్లుప్తంగా

పరిసరాలు పరిశుభ్రంగా ఉంటే వ్యాధులు దరి చేరవు

కమిషనర్ ఆనంద్‌కుమార్



సత్తెనపల్లి: పరిసరాలు పరిశుభ్రంగా ఉంటే వ్యాధులు దరి చేరవని మున్సిపల్ కమిషనర్ ఎస్.ఆనంద్‌కుమార్ అన్నారు. పట్టణంలోని ఎస్సీబిఐ ప్రాంతంలో మున్సిపల్ కార్మికులు చేపడుతున్న చెత్త తొలగింపును సోమవారం ఆయన పర్యవేక్షించారు. ఈ సందర్భంగా కమిషనర్ మాట్లాడుతూ ప్రతి ఒక్కరూ చెత్త చెదారాన్ని రోడ్లపై, డ్రైనేజీల్లో పడవేయకుండా మున్సిపల్ కార్మికులకు అందించాలన్నారు. ముఖ్యంగా పాలిథిన్ కవర్లను నిషేధించి చేతి సంచులను వాడాలన్నారు. దీనివల్ల చాలా వరకు డ్రైనేజీల్లో చెత్త చెదారం నిల్వ ఉండకుండా ఉంటుందన్నారు. ఈ సందర్భంగా పారిశుద్ధ్య కార్మికులకు పలు సూచనలు చేశారు. అనంతరం అన్న క్యాంటీన్‌ను సందర్శించి అక్కడ అందుతున్న ఆహార పదార్థాల నాణ్యత గురించి అడిగి తెలుసుకున్నారు. ఆయనతో పాటు శానిటరీ ఇన్‌స్పెక్టర్ విజయసారథి తదితరులు ఉన్నారు.

యోగా పోటీల్లో పలువురి ప్రతిభ




సత్తెనపల్లి: యోగాసనాల పోటీల్లో సత్తెనపల్లికి చెందిన పలువురు ప్రతిభ కనబరిచారు. సత్తెనపల్లి శక్తి యోగ రమేష్ ఆధ్వర్యంలో యోగాసన స్పోర్ట్స్ అసోసియేషన్ గుంటూరు డిస్ట్రిక్ట్, యోగా ఫెడరేషన్ ఆధ్వర్యంలో ఈ నెల 17న గుంటూరు అరండల్ పేటలోని నెహ్రూ కెనడి స్కూల్‌లో నిర్వహించిన పోటీల్లో రెండు విభాగాల్లో సత్తెనపల్లి వాసులు పాల్గొన్నారు. 35–45 సంవత్సరాల విభాగంలో సునీల్ కుమార్, 45–55 సంవత్సరాల విభాగంలో పులికొండ శ్రీనివాసరావు ప్రథమ స్థానంలో నిలవగా, వల్లూరు శ్రీనివాసరావు ద్వితీయ స్థానం, పులహరి బానోజీ తృతీయ స్థానం సాధించారు. విజేతలకు బహుమతులు ప్రదానం చేశారు. విజేతలను పట్టణంలోని తోటి యోగ సభ్యులు, నిత్య యోగ సాధకులు, యోగా గురువులు సోమవారం ప్రత్యేకంగా అభినందించారు.

వేంకటేశ్వరస్వామికి వివిధ పుష్పాలతో ప్రత్యేక పూజలు



రాజుపాలెం: మండల కేంద్రమైన రాజుపాలెంలో వేంచేసి ఉన్న పద్మావతీ గోదా సమేత వేంకటేశ్వరస్వామి ఆలయ బ్రహ్మోత్సవాలలో భాగంగా సోమవారం నాల్గవ రోజు స్వామి వారికి వివిధ పుష్పాలతో ప్రత్యేక పూజలు నిర్వహించారు. మహిళా భక్తులు అధిక సంఖ్యలో పాల్గొని ప్రత్యేక పూజలు నిర్వహించారు. 50 కేజీలు కలిగిన చామంతి, గులాబి, లిల్లీ, మల్లె, కాగడామల్లె తదితర పుష్పాలతో పూజలు నిర్వహించారు. భక్తులు అధిక సఖ్యలో పాల్గొని మొక్కులు చెల్లించారు. వారికి తీర్థప్రసాదాలను అందించారు. దేవస్థాన వ్యవస్థాపకులు, బాలాజీ ట్రస్ట్ చైర్మన్ పొత్తూరి వెంకటరమసుబ్బారావు దంపతులు పాల్గొని పూజలు నిర్వహించారు. సోమవారం రాత్రి ఏర్పాటు చేసిన సత్యహరిశ్చంద్ర పద్య నాటకం చూపరులను ఆకట్టుకుంది.

ఓటర్ల దరఖాస్తులను వెంటనే పరిశీలించాలి



ముప్పాళ్ళ: దరఖాస్తులను వెంటనే పరిశీలించి అర్హులైన వారికి ఓటు హక్కు కల్పించాలని తహసీల్దార్ కె.నగేష్ చెప్పారు. స్థానిక తహసీల్దార్ కార్యాలయంలో బీఎల్ఓలకు శిక్షణ కార్యక్రమం సోమవారం నిర్వహించారు. కార్యక్రమంలో భాగంగా ఇటీవల బదిలీలపై వెళ్లిన వారి స్థానంలో నూతన బీఎల్ఓలకు బాధ్యతలు అప్పగించారు. నూతనంగా బాధ్యతలు చేపట్టిన బీఎల్ఓలు ఓటర్ల జాబితాలపై అవగాహన పెంచుకోవాలన్నారు. ఆన్‌లైన్‌లో అందిన అర్జీలతో పాటు గ్రామ సచివాలయాల ద్వారా వచ్చిన దరఖాస్తులను ఎప్పటికప్పుడు పరిశీలించాలన్నారు. సమావేశంలో డిప్యూటీ తహసీల్దార్ బాలవెంకటేష్, ఆర్ఐ ఆంజనేయులు, ఆయా గ్రామాల వీఆర్వోలు, బీఎల్ఓలు పాల్గొన్నారు.

తటాకంలా రోడ్డు.. ప్రజల అవస్థలు



గుండ్లపల్లి బస్టాండ్ సెంటర్‌లో నిలిచిన వర్షపునీరు



నకరికల్లు–మాచర్ల రహదారిపై గుండ్లపల్లి వద్ద నిలిచిన వర్షపునీరు

- గుండ్లపల్లిలో డ్రైనేజీ వ్యవస్థ లేకపోవడంతో రోడ్డుపై నిలుస్తున్న నీరు
- అధికారులు చర్యలు చేపట్టాలని కోరుతున్న ప్రజలు

నకరికల్లు: మండలంలోని గుండ్లపల్లి గ్రామంలోని ప్రధాన రహదారి చినుకుపడితే చిత్తడిగా మారుతోంది. గోతులమయంగా, లోతట్టుగా ఉన్న రోడ్డు కొద్దిపాటి వర్షానికే తటాకంలా మారి వాహనాల రాకపోకలకు అంతరాయం కలుగుతుంది. రోడ్డుపై నిలిచిన నీరు వాహనాల రాకపోకల సమయంలో ప్రజలపై చిందిపెడుతూ చిరాకెత్తిస్తోంది. మండలంలోని గుండ్లపల్లి గుండా నకరికల్లు–మాచర్ల రహదారి వెళ్తుంది. రోడ్డుకు ఇరువైపులా గృహాలు, చిరువ్యాపారుల దుకాణాలు ఉన్నాయి. బస్టాండ్ కూడా అదే ప్రాంతంలో ఉండడంతో నిత్యం రద్దీగా ఉంటుంది. రోడ్డు లోతట్టుగా మారడంతో ఇటీవల కురిసిన్న వర్షాలకు రోడ్డుపై నీరు నిలిచింది. దీంతో రహదారి తటాకాన్ని తలపిస్తుంది. డ్రైనేజీ వ్యవస్థ కూడా రహదారికి ఇరువైపులా లేకపోవడంతో మురుగునీటితో పాటు వర్షపునీరు రోడ్డుపై నిలిచి ప్రజలు ఇబ్బందులు పడుతున్నారు. ప్రయాణికులు బస్సుల కోసం ఇదే ప్రాంతంలో వేచి ఉంటారు. వాహనాల రాకపోకల సమయంలో మురుగునీరంతా వారిపై చింది పడుతుంది. అసలే వర్షాకాలంలో సీజనల్ వ్యాధులు ప్రబలే అవకాశం ఎక్కువగా ఉంటుందని, రహదారిపై నిలిచి ఉన్న మురుగునీటితో అంటువ్యాధులు ప్రబలే ప్రమాదం పొంచి ఉందని ప్రజలు భయపడుతున్నారు. ఇప్పటికైనా ఆర్ అండ్ బీ, పంచాయతీరాజ్, వైద్య ఆరోగ్య శాఖ అధికారులు స్పందించి రోడ్డుకు ఇరువైపులా డ్రైనేజీ నిర్మించడంతో పాటు రోడ్డుపై ఉన్న గోతులకు మరమ్మతులు చేసి మురుగునీటి పారుదల క్రమబద్ధీకరించాలని, వ్యాధులు ప్రబలకుండా ముందస్తు చర్యలు చేపట్టాలని ప్రజలు కోరుతున్నారు.

విద్యుత్ శాఖ విస్తృత తనిఖీలు



తనిఖీల్లో పాల్గొన్న విద్యుత్ సిబ్బంది

ముప్పాళ్ళ: విద్యుత్ శాఖ విజిలెన్స్ ఆపరేషన్స్ విభాగం ఆధ్వర్యంలో మండల పరిధిలోని దమ్మాలపాడు, ఇరుకుపాలెం, బొల్లవరం, గోళ్ళపాడు, తురకపాలెం, చాగంటివారిపాలెం, రుద్రవరం, తొండపి గ్రామాల్లో విస్తృత తనిఖీలు నిర్వహించారని ఈఈ (విజిలెన్స్) డీపీఈ సీహెచ్ కోటేశ్వరరావు, ఆపరేషన్స్ ఈఈ రాంబట్లు సోమవారం తెలిపారు. తనిఖీల్లో మీటరు లేకుండా విద్యుత్ వాడుతున్న 8 మందికి రూ.13 వేలు, అక్రమంగా విద్యుత్ చౌర్యంకు పాల్పడుతున్న 10 మందికి రూ.1.55 లక్షలు, ఇతర కేటగిరీలో వాడుకుంటున్న ఐదుగురికి రూ.20 వేలు, అదనపు లోడ్ వాడుతున్న 114 మందికి రూ.4.60 లక్షలు అపరాధ రుసుము విధించినట్లు తెలిపారు.

మండపాలకు అనుమతి తప్పనిసరి..

వినాయకచవితి సందర్భంగా నిర్మించే మండపాలకు అనుమతి తప్పనిసరిగా తీసుకోవాలని, లోడ్‌కు తగిన డీడీ చెల్లించాలని విద్యుత్ ఏఈ సుచరిత తెలిపారు. విద్యుత్ చౌర్యంపై ఫిర్యాదులను 9440812263, 9440812360, 9440812361 నంబర్‌లకు అందించవచ్చన్నారు. సమాచారం తెలిపిన వారి వివరాలు గోప్యంగా ఉంచుతామన్నారు. తనిఖీల్లో డీఈఈలు రవికుమార్, ఎస్.మల్లికార్జునప్రసాద్, ఎస్.శ్రీనివాసరావు, ఎ.శ్రీనివాసరావు, ఏఈలు కె.కోటేశ్వరరావు, ఎం.సతీష్‌కుమార్, యు.శివశంకర్, జి.సుచరిత, ఆపరేషన్స్ డీఈ, ఏఈలు పాల్గొన్నారు.

మిర్చి పెంపకంలో రైతులు అప్రమత్తంగా ఉండాలి

ఏవో ఎస్‌కే అహ్మద్



మిర్చి నారు నాటుతున్న రైతులు

అమరావతి: మండలంలో ఇప్పుడిప్పుడే మిరప నారు నాటుతున్న రైతులు కలుపు నివారణకు నాటడానికి 1, 2 రోజులు ముందు ఎకరానికి 200 లీ.నీటిలో 1.5 లీ. పెండీమిథాలిన్ 30 శాతం కలిపి పిచికారీ చేయాలని ఏవో ఎస్‌కే అహ్మద్ తెలిపారు. సోమవారం ఆయన మిర్చి రైతులకు సూచనలిస్తూ మిరప నారు నాటిన 15 నుంచి 20 రోజులలో రెండు మూడు సార్లు అంతరకృషి చేయాలన్నారు. అంతరకృషి సాధ్యం కాకపోతే 200 లీటర్ల నీటిలో క్విజలాఫాప్‌ఇథైల్ 5 శాతం కలిపి పిచికారీ చేస్తే గడ్డి జాతి మొక్కలను నిర్మూలించవచ్చన్నారు. పైరుపై పేనుబంక నివారణకు ఎకరానికి 400 మిల్లీలీటర్ల మిథైల్ డెమెటాన్, 300 గ్రాముల ఎసిఫేట్ చొప్పున పిచికారీ చేయాలన్నారు. రైతులు ఇలాంటి జాగ్రత్తలు పాటించినట్లయితే మొక్కలు ఆరోగ్యంగా పెరుగుతాయన్నారు.

పంట దెబ్బతిన్న రైతులను ఆదుకోండి

వైఎస్సార్‌సీపీ జిల్లా బీసీ నాయకులు కోవూరి సుధాకర్

అమరావతి: మండల పరిధిలోని పలు గ్రామాలలో ఇటీవల కురిసిన భారీ వర్షాలకు వాగులు పొంగటం వల్ల పంట దెబ్బతిన్న రైతులను ఆదుకోవాలని వైఎస్సార్‌సీపీ జిల్లా బీసీ నాయకులు కోవూరి సుధాకర్ సోమవారం ఒక ప్రకటనలో కోరారు. మండలంలోని నెమలికల్లు, ఉంగుటూరు, ఎండ్రాయి, చావపాడు, నరుకుళ్ళపాడు, వైకుంఠపురం, ధరణికోట అమరావతి గ్రామాల్లో పంట నీట మునిగి రైతులు నష్టపోయారన్నారు. ఒక్కో రైతుకి ఎకరానికి ఇప్పటికే విత్తనాలు, కూలి కలిపి మొత్తంగా రూ.10 నుంచి రూ.15 వేలు పెట్టుబడి వరద పాలైందన్నారు. రైతులకు విత్తనాలు, ఎరువులను సబ్సిడీపై అందించి ఎకరాకు రూ.7,500 ఆర్థిక సాయం అందించాలన్నారు. రైతు ప్రభుత్వంగా చెప్పుకునే కూటమి ప్రభుత్వం రైతులకు వెంటనే ఆదుకోవాలన్నారు. సహకార సంఘాల ద్వారా రైతులకు ఎరువులు అందించే విధంగా వ్యవసాయ శాఖాధికారులు చర్యలు తీసుకోవాలన్నారు.

వీఏఏలు, వీహెచ్‌ఏల భాగస్వామ్యం తప్పనిసరి

ప్రకృతి వ్యవసాయం జిల్లా ప్రాజెక్ట్ మేనేజర్ అమలకుమారి



మాట్లాడుతున్న ప్రకృతి వ్యవసాయం జిల్లా ప్రాజెక్ట్ మేనేజర్ అమలకుమారి

సత్తెనపల్లి: ప్రకృతి సాగులో వీఏఏలు, వీహెచ్‌ఏల భాగస్వామ్యం తప్పనిసరని పల్నాడు జిల్లా ప్రకృతి వ్యవసాయం ప్రాజెక్ట్ మేనేజర్ కె.అమలకుమారి స్పష్టం చేశారు. పట్టణంలోని ఇంటిగ్రేటెడ్ అగ్రికల్చర్ ల్యాబ్ కేంద్రంలో పెదకూరపాడు, సత్తెనపల్లి, ముప్పాళ్ల మండలాల వీఏఏలు, వీహెచ్‌ఏలు, సిబ్బందికి మూడు రోజుల ప్రకృతి వ్యవసాయ శిక్షణ కార్యక్రమంలో సోమవారం శిక్షణను ఆమె ప్రారంభించి మాట్లాడారు. ప్రస్తుత కాలంలో అధిక రసాయనాల వాడకంతో భూమి సారం తగ్గిపోతుందన్నారు. భూమి ఆరోగ్యం దెబ్బతింటూ రైతులు నష్టపోతున్నారన్నారు. ఇలాంటి పరిస్థితుల్లో ప్రకృతి వ్యవసాయం ఆచరించాలని, ప్రకృతి వ్యవసాయ సిబ్బందితో పాటు వీఏఏలు, వీహెచ్‌ఏలు ఆ దిశగా రైతులను ప్రోత్సహించాలన్నారు. జిల్లా రిసోర్స్‌పర్సన్ కె.రామచందరరావు మాట్లాడుతూ ప్రకృతి వ్యవసాయం అనేది ఒక మోడల్ సైన్స్ అని, భూమిని 365 రోజులు కప్పి ఉంచితే భూమికి నిరంతరం కర్బనం అంది, సారవంతం అవుతుందన్నారు. రైతులు జీవన ప్రమాణాలు మెరుగుపరచుకోవాలంటే ఏ–గ్రేడ్, ఏటీఎమ్ మోడల్స్‌ను అవలంబించాలన్నారు. సత్తెనపల్లి ఏడీఏ బోయపాటి రవిబాబు మాట్లాడుతూ రసాయనాలు వదిలి ప్రకృతి పద్ధతుల్లో పంటలు పండించడం వలన భూమి ఆరోగ్యంగా ఉంటుందన్నారు. ఈ విధానంలో పండిన పంటలు ఆరోగ్యకరమైన, నాణ్యమైన ఆహారం అందిస్తాయన్నారు. భవిష్యత్తు తరాలకు పర్యావరణాన్ని కాపాడే శక్తి ప్రకృతి వ్యవసాయానికి ఉందన్నారు. కార్యక్రమంలో ఏవోలు బి.సుబ్బారెడ్డి, ఎస్.శ్రీధర్‌రెడ్డి, కృష్ణయ్య, జిల్లా ట్రైనర్స్ సైదయ్య, నందకుమార్, అప్పలరాజు, సత్తెనపల్లి డివిజన్ ఎంసీ మధుబాబు, యూనిట్ ఇన్‌చార్జిలు, ప్రకృతి వ్యవసాయ సిబ్బంది, వీఏఏలు, వీహెచ్‌ఏలు పాల్గొన్నారు.

• వేధిస్తోన్న వీధి కుక్కల సమస్య..!



పట్టణంలోని రైల్వేస్టేషన్ రోడ్డులో వీధికుక్కలు

సత్తెనపల్లి: పట్టణంలో వీధి కుక్కల సంఖ్య అంతకంతకూ పెరిగి.. అడుగడుగునా భయంతో వీధి కుక్కల సమస్య వేధిస్తోంది. వాహనదారులు, మహిళలు, విద్యార్థులు నిత్యం వీధుల్లో బిక్కుబిక్కుమని రాకపోకలు సాగిస్తున్నారు. పట్టణ వ్యాప్తంగా వీధికుక్కల సంఖ్య వేలల్లోనే ఉంటుందని ఒక అంచనా.. పదుల సంఖ్యలో కనిపించే వీధి శునకాల గుంపులు... ఏమాత్రం కదిలినా నీ పిక్క లాగేస్తాం.. అనే అంతగా వాటి కొరకొర చూపులు... కనిపిస్తే చాలు గుండె ఆగినంత పని అవుతుంది. పట్టణ వీధుల్లో ప్రాణాలు అరచేతుల్లో పెట్టుకొని నడవాల్సి వస్తున్నా వీటి కట్టడిపై పురపాలక సంఘం మాత్రం చర్యలు తీసుకోవడం లేదని విమర్శలు వెల్లువెత్తుతున్నాయి.

ఉధృతంగా ప్రవహిస్తున్న కృష్ణానది

తీరప్రాంత ప్రజలు అప్రమత్తంగా ఉండాలని సూచించిన తహసీల్దారు శ్రీనివాసరావు



తాడువాయి వద్ద ఉధృతంగా ప్రవహిస్తున్న కృష్ణానది

అచ్చంపేట: పులిచింతల ప్రాజెక్టు నుంచి 3 లక్షల క్యూసెక్కులకు పైగా వరద నీటిని విడుదల చేయడంతో దిగువ కృష్ణానది ఉధృతంగా ప్రవహిస్తోంది. లోతట్టు ప్రాంత ప్రజలు అప్రమత్తంగా ఉండాలని తహసీల్దారు కుంభా శ్రీనివాసరావు దండోరా, దేవాలయాలలో మైకులు ద్వారా హెచ్చరికలు జారీ చేశారు. చేపలు పట్టే వారిని నదిలోకి వెళ్లనీయకుండా నదీ తీరాల వద్ద గ్రామ సహాయకులను కాపలా ఉంచారు. నదిపై నుంచి పడవలు, బల్లకట్టు ప్రయాణాలను నిలిపి వేశారు. ప్రాజెక్టు దిగువకు సోమవారం రాత్రికి ఇంకా వరద నీటిని వదిలే అవకాశాలున్నందున నదీ తీరప్రాంత గ్రామాల ప్రజలు అప్రమత్తంగా ఉండాలని తహసీల్దారు తెలిపారు. అవసరాన్ని బట్టి పునరావాస చర్యలు చేపట్టనున్నట్లు పేర్కొన్నారు.

హెచ్‌ఐవీ వ్యాధి గ్రస్తులపై వివక్ష మానాలి

లింక్‌వర్కర్ స్కిప్ జోనల్ సూపర్‌వైజర్ ఈశ్వరరావు



నకరికల్లు: హెచ్‌ఐవీ వ్యాధిగ్రస్తులపై వివక్ష, చిన్న చూపు చూపకుండా సమాజంలో కలసిమెలసి జీవించే స్వేచ్ఛ ఇవ్వాలని లింక్ వర్కర్ స్కిప్ జోనల్ సూపర్‌వైజర్ ఎం.ఈశ్వరరావు అన్నారు. స్థానిక కస్తూర్బాగాంధీ బాలికల పాఠశాలలో హెచ్‌ఐవీ, ఎయిడ్స్ వ్యాధిపై విద్యార్థినులకు సోమవారం అవగాహన కల్పించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ఆంధ్రప్రదేశ్ రాష్ట్ర ఎయిడ్స్ నియంత్రణ సంస్థ, చైల్డ్‌ఫండ్ ఇండియా లింక్ వర్కర్ స్కీం ఆధ్వర్యంలో విద్యార్థులకు ఇంటెన్సిఫైడ్ ఇన్ఫర్మేషన్ ఎడ్యుకేషన్ తరగతులు నిర్వహించి అవగాహన కల్పిస్తున్నట్లు తెలిపారు. హెచ్‌ఐవీ, ఎయిడ్స్ యాక్ట్ 2017, ఏఆర్‌టీ మందులు, క్షయ వ్యాధి సంబంధిత సమస్యలు తదితర వ్యాధుల చికిత్సపై అవగాహన కల్పిస్తున్నట్లు తెలియజేశారు. లింక్ వర్కర్ స్కీం అందించే సేవలను వివరించారు. కార్యక్రమంలో పాఠశాల ప్రిన్సిపాల్ లక్ష్మి, లింక్‌వర్కర్ దయామణి, విశ్వేశ్వరరావు తదితరులు పాల్గొన్నారు.

అంకిత భావంతో పని చేస్తే మన్ననలు

అభ్యుదయ విజ్ఞాన సమితి అధ్యక్షుడు మల్లికార్జునరావు



కమిషనర్ ఆనంద్‌కుమార్‌ను సత్కరించిన విజ్ఞాన సమితి అధ్యక్షుడు మల్లిఖార్జునరావు

సత్తెనపల్లి: అంకిత భావంతో పని చేసే ఉద్యోగులకు ఎల్లప్పుడూ ప్రజల నుంచి మన్ననలు లభిస్తాయని అభ్యుదయ విజ్ఞాన సమితి అధ్యక్షుడు మాడా మల్లికార్జునరావు అన్నారు. పుర ప్రజలకు ఉత్తమ సేవలందించిన మున్సిపల్ కమిషనర్ ఎస్.ఆనంద్‌కుమార్ స్వాతంత్ర్య దినోత్సవం సందర్భంగా రాష్ట్ర పౌరసరఫరాల శాఖ మంత్రి నాదెండ్ల మనోహర్, జిల్లా కలెక్టర్ పి.అరుణ్‌బాబు చేతుల మీదుగా ప్రశంసాపత్రాన్ని అందుకున్నారు. ఈ సందర్భంగా అభ్యుదయ విజ్ఞాన సమితి ఆధ్వర్యంలో సోమవారం కమిషనర్ ఆనంద్ కుమార్‌ను పూలమాలలు, దుశ్శాలువాలతో సత్కరించారు. ఈ సందర్భంగా అభ్యుదయ విజ్ఞాన సమితి అధ్యక్షుడు మల్లికార్జునరావు మాట్లాడుతూ ప్రభుత్వ ఉద్యోగులు విధి నిర్వహణలో అంకిత భావంతో పని చేసే వారిని ప్రజలు ఎప్పుడు ఆదరిస్తారని, ప్రజల మన్ననలు పొందుతారన్నారు. భవిష్యత్తులో మరిన్ని ఉత్తమ పురస్కారాలు అందుకోవాలని ఆకాంక్షించి, కమిషనర్‌కు ప్రత్యేక అభినందనలు తెలిపారు. కార్యక్రమంలో అభ్యుదయ విజ్ఞాన సమితి బాధ్యులు కూనాగు వెంకటేశ్వర్లు(బుజ్జి), పిల్లుట్ల ఆంజనేయులు, పణిదరపు నరసింహారావు, టైలర్ ఖాజావలి, పులిపాటి సైదయ్య, రాజుపాలెం సైదారావు, న్యాయవాది దివ్వెల శ్రీనివాసరావు తదితరులు ఉన్నారు.

బాలికపై బాలుడి వేధింపులు

పెదకూరపాడు: బాలికపై బాలుడు వేధింపులకు పాల్పడిన ఘటనపై పెదకూరపాడు పోలీస్ స్టేషన్‌లో ఆదివారం రాత్రి కేసు నమోదైంది. పెదకూరపాడు ఎస్ఐ గిరిబాబు తెలిపిన వివరాల ప్రకారం.. మండలంలోని ఓ గ్రామానికి చెందిన 15 సంవత్సరాల బాలికను అదే గ్రామానికి చెందిన బాలుడు ప్రేమిస్తున్నానని వెంటపడుతూ, మెసేజ్‌లు పెడుతూ, ప్రేమించకపోతే చంపేస్తానని బెదిరిస్తున్నాడని బాధితురాలి తల్లి మేడ బాజీకి తెలపగా బాజీ పెదకూరపాడు పోలీసులను ఆశ్రయించింది. బాజీ ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసినట్లు గిరిబాబు తెలిపారు.

‘పల్లె వెలుగు’ ఎక్కడ..?

- ఉచిత బస్సుల కోసం మహిళా ప్రయాణికుల పడిగాపులు
- ఇప్పటికీ గ్రామాలకు తిరగని పల్లె వెలుగు బస్సులు
- ఉచిత బస్సు పథకంతో ఒరిగేదేమీ లేదని జనం ఎద్దేవా
- ఆటోలు, ఇతర సాధనాల్లో మహిళల ప్రయాణం



అమరావతి బస్టాప్ సెంటర్‌లో వేచి ఉన్న మహిళలు

సత్తెనపల్లి: ఆర్టీసీలో మహిళలకు ఉచిత ప్రయాణం అందిస్తున్న ప్రభుత్వం అందుకు సరిపడా బస్సులు డిపోలలో అందుబాటులో ఉంచకపోవడం, కొన్ని సర్వీసులకే ఉచిత ప్రయాణం వెసులుబాటు కల్పించడంతో మహిళలు తంటాలు పడుతున్నారు. సత్తెనపల్లి, పెదకూరపాడు నియోజకవర్గాల్లోని ప్రజలు ఎక్కువగా నరసరావుపేట, గుంటూరు, విజయవాడ వైపు ప్రయాణం చేస్తుంటారు. బస్టాండుకు వచ్చిన మహిళలు సరైన సమయంలో బస్సులు రాక ఇబ్బందులు పడుతున్నారు. సూపర్ లగ్జరీ, డీలక్స్ బస్సుల్లో ఉచితం లేకపోవడం.. బస్సులు సమయానికి రాక అసహనం వ్యక్తం చేస్తున్నారు. దానికి తోడు సత్తెనపల్లి బస్టాండ్‌లో మహిళా ప్రయాణికులకు కనీస వసతులు లేక ఇబ్బందులు ఎదుర్కొంటున్నారు. అన్ని రకాల సర్వీసుల్లో ఉచితంగా ప్రయాణించే వెసులుబాటు కల్పించడంతో పాటు బస్సుల సంఖ్య పెంచాలని పలువురు మహిళలు కోరుతున్నారు.

22 గ్రామాలకు లేని సర్వీసులు

పల్లె వెలుగు పేరుతో తిప్పుతున్న బస్సులు గ్రామాలకు దూరంగా పోతున్నాయి. ప్రధాన రహదారుల్లో ఎక్కువగా మాచర్ల, పిడుగురాళ్ల డిపోల నుంచి ఎక్స్‌ప్రెస్, డీలక్స్, లగ్జరీ బస్సులు తిరుగుతుండడంతో మహిళలకు ఏమాత్రం ఉపయోగం లేకుండా పోయింది. ఎప్పుడో అరకొరగా వచ్చే పల్లె వెలుగు బస్సుల కోసం గంటల తరబడి వేసి ఉండాల్సి వస్తుందని, ఒకవేళ బస్సులు వచ్చినా ప్రయాణికులు నిండుగా ఉండటంతో ఆటోలను ఆశ్రయించాల్సిన పరిస్థితి. సత్తెనపల్లి నుంచి మహిళలతో పాటు పురుషులు గుంటూరు, విజయవాడ వెళ్లేందుకు తాలూకా సెంటర్‌లో వేచి ఉంటున్నారు. గతంలో బస్సులు నడిపిన రూట్లలో కూడా ప్రస్తుతం ఆలస్యంగా నడుస్తున్నాయి. సత్తెనపల్లి డిపోలో కేవలం 53 బస్సులు మాత్రమే ఉండగా వీటిలో ఆర్టీసీవి 32, హయ్యర్ బస్సులు 21 ఉన్నాయి. ఆర్టీసీకి చెందిన 32 బస్సుల్లో 30 పల్లె వెలుగు కాగా మిగిలిన 3 దూర ప్రాంతాలైన హైదరాబాద్, తిరుపతి వెళ్లే బస్సులు. 19 రూట్లలో 50 పల్లె వెలుగు బస్సులు నడుస్తున్నాయి. సత్తెనపల్లి డిపో పరిధిలో 22 గ్రామాలకు కనీసం పల్లె వెలుగు బస్సులు వెళ్లడం లేదు. ఆయా గ్రామాలకు ఆటోలను ఆశ్రయించాల్సి వస్తుందని ప్రయాణికులు వాపోతున్నారు. దీంతో మహిళలు ఉచిత బస్సుపై ఆసక్తి చూపడం లేదు. ఆర్టీసీ అధికారులు స్పందించి ప్రస్తుత పరిస్థితులకు అనుగుణంగా బస్సులు నడపాలని కోరుతున్నారు.



అచ్చంపేట బస్టాప్ సెంటర్‌లో వేచి ఉన్న ప్రయాణికులు

ఆలిండియా కరాటే చాంపియన్ షిప్‌లో విద్యార్థుల ప్రతిభ



సత్తెనపల్లి: ఒంగోలులోని ఇండోర్ స్టేడియంలో ఈ నెల 17న నిర్వహించిన ఆల్ ఇండియా కరాటే చాంపియన్‌షిప్ పోటీల్లో సత్తెనపల్లికి చెందిన షికోకాయ్ షిటోరియో కరాటే స్కూల్ విద్యార్థులు ప్రతిభ చూపారు. ఆల్ ఇండియా కరాటే చాంపియన్ షిప్‌లో వ్యక్తిగత బాలికల కటా విభాగంలో 9 మంది, వ్యక్తిగత బాలుర కటా విభాగంలో 13 మంది విద్యార్థులు ప్రతిభ కనబరిచారు. ప్రతిభ చూపిన వారికి బ్రాంజ్, గోల్డ, సిల్వర్ మెడల్స్‌ను బహూకరించారు. ఈ సందర్భంగా ప్రతిభ చూపిన విద్యార్థులను, శిక్షణ ఇచ్చిన షిహాన్ అనుముల రాంబాబు, కోచ్ అనుముల రామయ్యలను ఇండియా వైస్ ప్రెసిడెంట్ మిల్టన్ శాస్త్రి, ఏపీ వైస్ ప్రెసిడెంట్ నల్లూరి మోహన్‌రావులు సోమవారం ప్రత్యేకంగా అభినందించారు.